

నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు షేలీనాయక్ పోచారం సమక్షంలో శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- బాన్సువాడ రూరల్, మే 11

## కాలభైరవుడి ఆలయంలో అనిల్‌కుమార్ పూజలు

రామారెడ్డి, మే 11: మండలంలో వెలిసిన కాలభైరవ స్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు రామారెడ్డిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్, నాయకులు సాయినేని సత్యంరావు, గురజాల నారాయణరెడ్డి, తుపాకుల రాజేందర్ గౌడ్, భానూరి నర్సారెడ్డి, కాసర్ల రాజేందర్, గంజి సతీశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అనిల్‌కుమార్

## బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ వడ్లం గ్రామశాఖ ఉపాధ్యక్షుడు సంగప్ప

పెద్దకొడప్‌గల్, మే 11: మండలంలోని వడ్లం బీజేపీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు సంగప్ప శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో పనిచేసినా తగిన గుర్తింపులేదన్నారు. దీంతో బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సంజీవ్‌పటేల్, మాజీ ఎంపీటీసీ అంజయ్య, మాజీ సర్పంచ్ పోచయ్య, నాయకులు నందు, పండరి పాల్గొన్నారు.

## సంగారెడ్డికి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల బాక్సులు



ఎల్లారెడ్డి రెవెన్యూ కార్యాలయం నుంచి సంగారెడ్డికి తరలిస్తున్న పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల బాక్సులు

ఎల్లారెడ్డి రూరల్, మే 11: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శుక్రవారం ముగిసింది. దీంతో ఓట్ల బ్యాక్సులను ఎల్లారెడ్డి పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం నుంచి సంగారెడ్డిలోని గీతం యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌కు శనివారం తరలించారు. నియోజకవర్గంలో మొత్తం 1,027 పోస్టల్ ఓట్లు పోలయ్యాయని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అల్లం మహేందర్, గిర్దావర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వోపై విచారణ

కామారెడ్డి, మే 11 : కామారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్ వ్యవహార శైలిపై వచ్చిన ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించింది. డీఎంహెచ్‌వో కొన్ని నెలలుగా వ్యక్తిగత వివరాలు కోరుతున్నారని, ఫోన్లు చేస్తున్నారని, అనుచిత పదాలను వాడుతున్నారని, అనవసరంగా తాకుతున్నారని ఆరోపిస్తూ రామారెడ్డి పీహెచ్‌సీ మహిళా వైద్యులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తంచేశారు. దీనిపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ స్పందించారు. ప్రాథమిక విచారణ కోసం డిపార్ట్‌మెంట్ నుంచి సీనియర్ అధికారి డాక్టర్ అమర్‌సింగ్ నాయక్, అదనపు డైరెక్టర్‌ను నియమించినట్లు తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని శనివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్‌తోపాటు ఫిర్యాదుల కమిటీ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, NAZIA SULTANA W/O JAMEEL AHMED, R/o. H.No.1-2-680,Rakasipet, Bodhan, (D) Nzb. Changed my name as AAYESHA KAUSER
NTZ-324807

CHANGE OF NAME
★I, MOHAMMAD ABDUL MUJEEB,S/O MOHAMMAD ABDUL MAQBUL, R/o. H.No.1-5-118/9/1, Zirayath nagar, Armoor (D) NZB.CHANGED MY NAME AS ABDUL MUJEEB S/O ABDUL MAQBOOL
NTZ-324809

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షం.. రేవంత్ పాలనలో దుర్భిక్షం

- విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్..
- ఆరు గ్యారెంటీలు అమలు చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

బాన్సువాడ రూరల్/బాన్సువాడ టౌన్, మే 11: పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్లి సుభిక్షంగా ఉన్నదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రం దుర్భిక్షంగా మారిందని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పాలనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా శనివారం బాన్సువాడ మండలంలోని తాడ్కోల్, దేశాయిపేట్ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. తాడ్కోల్‌లో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఎండగడుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలైన రైతుబంధు, రైతుబీమా, 24 గంట ఉచిత విద్యుత్, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, గురుకుల పాఠశాలలు తదితర అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన రైతుభరోసా ఎకరాకు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, వరికి క్వింటాలుకు రూ.500 బోనస్. 18 ఏండ్లు నిండిన ఆడబిడ్డలకు నెలకు రూ.2500, ఆసరా పింఛన్లు రూ.4వేలు, నిరుద్యోగ భృతి రూ.4వేలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో ఆడబిడ్డలకు రూ. లక్షతోపాటు తులం బంగారం, రూ.రెండులక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లకు రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని పోచారం సవాల్ విసిరారు. పదేండ్లు ఎంపీగా పని చేసి ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్ పార్లమెంట్ పరిధిలో ఏం పని చేశారో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. ఐదేండ్లు కాంగ్రెస్ ఎంపీగా పనిచేసిన సురేశ్ షెట్కార్ చేసిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నార్ల రవీందర్, గురువినయ్‌కుమార్, ఎంపీటీసీ వెంకటరమణ, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, నాయకులు శ్రీధర్, ప్రశాంత్ కుమార్, నరహరి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దేశాయిపేట్‌లో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

# బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన సాధ్యం

- గ్రామాల్లో నాయకుల విస్తృత ప్రచారం
- గాలి అనిల్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని విన్నపం

**లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం ఆరు గంటలతో తెరపడింది. ప్రచారానికి చివరి రోజు కావడంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నదని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.**



ఎల్లారెడ్డి మండలం ఐలాపూర్‌లో ప్రచారం చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్

ఎల్లారెడ్డి రూరల్/గాంధారి/పెద్దకొడప్‌గల్/డోంగ్లీ/ బాన్సువాడ/బాన్సువాడ రూరల్/బిచ్కుంద/భిక్కనూరు, మే 11: రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడం ఒక్క బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీల అబద్ధపు, మోసపూరిత హామీలను నమ్మవద్దన్నారు. కారు గుర్తుకు ఓటేసి జహీరాబాద్ ఎంపీగా గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ప్రచారానికి చివరి రోజు కావడంతో గాంధారితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ రాధాబలరాం, వైస్ ఎంపీపీ భజన్‌లాల్, ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ రెడ్డి రాజు, మండల కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ముస్తఫా, కొమ్ములు రమేశ్, నాగ్లూర్ మల్లేశ్, జింగురు సురేశ్, తూర్పు సంతోష్, పత్తి సాయిలు, రవీందర్, దొల్లు సాయిలు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, నాయకులు హన్మంత్‌రెడ్డి, గొర్రె శంకర్ మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

డోంగ్లీలో బీఆర్‌ఎస్ నాయకులు గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్‌ను చూపిస్తూ.. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు ఓంకార్ పాటిల్, నాయకులు విఠల్, వీరన్న, పాషా తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ మండలంలోని కోమలంచ గ్రామంలో గాలి అనిల్ కుమార్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాద సత్యనారాయణ, గంగారెడ్డి, సిద్ది రాంరెడ్డి, బలరాం, కాశీరాం, లక్ష్మణ్, బాల్‌రెడ్డి, భైరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ మండలంలోని బోర్లం, ఇబ్రహీంపేట్, తిర్మలాపూర్, కొత్తాబాది తదితర గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ నాయక్, రాజేశ్వర్ గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఎంపీపీ అశోక్ పటేల్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రావు దేశాయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, డాక్టర్ రాజు, కలీం పటేల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సంజు పటేల్, మల్లికార్జున్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరుతోపాటు ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి బోండ్ల సునీల్, యూత్ నాయకులు గంగళ్ల రవీందర్, చంద్రం, రాజు, వేణు, యూత్ నాయకులు పాల్గొన్నారు.



గాంధారిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పెద్దకొడప్‌గల్‌లో ఉపాధి హామీ పనుల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



డోంగ్లీలో ప్రచారం చేస్తున్న నాయకులు



బిచ్కుంద మండలం గోపన్‌పల్లిలో..



కోమలంచలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



భిక్కనూరులో నమూనా ఈవీఎంను చూపుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలు

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, మే 11: లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సింధుశర్మ, ట్రైనీ ఎస్పీ కాజల్‌తో కలిసి 48 గంటల నిశ్శబ్ద కాలంలో చేయాల్సిన, చేయకూడని అంశాలను కలెక్టర్ వివరించారు. ఎన్నికలు ముగిసే వరకు ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించొద్దని తెలిపారు. ఐదుగురికి మించి ఒకే చోట గుమిగూడ వద్దని సూచించారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్(నిశ్శబ్ద కాలం) దృష్ట్యా జిల్లాయేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండకూడదని స్పష్టం చేశారు. డబ్బు, మద్యం, విలువైన బహుమతులతో ఓటర్లను ప్రభావితం చేయడం సెక్షన్ 171 ప్రకారం నేరమని తెలిపారు. వాటి నిరోధానికి ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాలతో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు. పోలింగ్ రోజు 100 మీటర్ల అవతల తెల్ల కాగితంపై ఓటరు స్లిప్పులు అందించాలని, పోలింగ్ కేంద్రానికి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టంచేశారు. ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో మద్యం షాపులను మూసివేయించి, డ్రై డేగా ప్రకటించినట్లు తెలిపారు. పోలింగ్ సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందని అన్నారు. అనంతరం ఎస్పీ సింధుశర్మ మాట్లాడుతూ.. సైలెన్స్ పీరియడ్‌లో ఇతర నియోజకవర్గ ప్రజలు ఎవరు కూడా నియోజకవర్గంలో ఉండొద్దని అన్నారు. హోటళ్లు, లాడ్జీలు తదితర వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని చెప్పారు. జిల్లాలో శనివారం వరకు కోటీ 91 లక్షల రూపాయల నగదుతోపాటు 6,790 లీటర్ల మద్యం పట్టుకొని కేసులు నమోదు చేశామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లతోపాటు కొత్తగా 583 మందిని బైండోవర్ చేశామని అన్నారు. లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధుశర్మ

## ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, మే 11: ఎల్లారెడ్డి పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సాయిబాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీ వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని, ప్రతి గ్రూపులో 40 సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. ఎస్సెస్సీ పాసైన విద్యార్థులు సమీపంలోని మీ సేవ కేంద్రాలకు వెళ్లి ఆధార్‌కార్డు, మార్కుల మెమో, ఒక ఫొటోతో www.tsmodel schools.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, మే 11: అత్తాకోడళ్ల మధ్య గొడవ జరగడంతో 15 నెలల బాబుతోపాటు యువతి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండలంలోని రుద్రారంలో చోటుచేసుకున్నది. ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి ప్రశాంత్ భార్య సంధ్యకు ఆమె అత్త లక్ష్మికి మధ్య 10వ తేదీన గొడవ జరిగింది. దీంతో సంధ్య తన 15 నెలల బాబు చైతన్యను తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. విషయాన్ని సంధ్య తల్లి పద్మకు తెలుపగా.. ఆమె వచ్చి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సంధ్య కనిపించడం లేదని తల్లి పద్మ ఎల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి రూరల్, మే 11: మండలంలోని మత్తమాల గ్రామ శివారులో ఉన్న నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో శనివారం ఒక గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని స్థానిక ఎస్సై బొజ్జ మహేశ్ సందర్శించారు. ఇటీవల ఎవరైనా తప్పిపోయిన వారు ఉంటే సంబంధీకులు తమను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

## లారీల కొరతను తీర్చండి



సప్దల్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు

ఎల్లారెడ్డి, మే 11: తూకం వేసినధాన్యాన్ని తరలించడానికి సరిపడా లారీలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు అన్నారు. శనివారం ఆయన మండలంలోని సప్దల్‌పూర్, పోసానిపల్లి, అడవిలింగాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యాన్ని తరలించేందుకు తగినన్ని లారీలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. రైస్‌మిల్లుల్లో లోడ్‌ను డంప్ చేసిన వెంటనే లారీలను కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఆయనతోపాటు సొసైటీ సీఈవో విశ్వనాథం, రైతులు ఉన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

రామారెడ్డి, మే 11: మండలంలోని మద్దికుంట గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓరుగంటి లక్ష్మణ్ గురువారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటి వెనుక తలుపు తెరిచి ఉండడంతో బాధితుడి తల్లి గమనించి అతడికి సమాచారం అందించింది. అతడు వచ్చి చూడగా.. ఇంట్లోని బీరువా తెరిచి ఉన్నది. బీరువాలో ఉన్న పది గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.25వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మద్దికుంటలో దుండగులు తెరిచిన బీరువా